క్లుప్తంగా

వితరణ



అనాథ పిల్లలకు ఆర్థిక సాయం చేస్తున్న ఎంఈఓలు రాజ్‌కుమార్, పాపినాయుడు, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు దాతృత్వం చాటుకున్నారు. మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న అనాథలైన పది మంది నిరుపేద విద్యార్థులకు ఒక్కొక్కరికీ జత బట్టలు, రూ. 600 చొప్పున నగదును ఎంఈఓలు రాజ్‌కుమార్, పాపినాయుడు చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు కెళ్ల గోవింద, వైకుంటరమణ, పక్కి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు సంక్రాంతి సరుకులు



నిరుపేద కుటుంబానికి నిత్యావసరాలు, నగదు సాయాన్ని అందజేస్తున్న ఎంపీజీ.ఈశ్వరరావు, తదితరులు

విజయనగరం టౌన్: నిరుపేదల కళ్లల్లో ఆనందాన్ని చూడాలనే ఉద్దేశంతో సంక్రాంతి పండగను పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శిష్టకరణ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎంపీజీ.ఈశ్వరరావు అన్నా రు. శుక్రవారం స్థానిక డబుల్ కాలనీలో నివా సముంటున్న నిరుపేద కుటుంబానికి నెల రోజులకు సరిపడా రేషన్ సరుకులు, నగదు సాయం అందించారు. కార్యక్రమంలో బలివా డ వెంకటరమణ, బి.మధుసూదనరావు, రఘు పాత్రుని అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శివన్నారాయణ

విజయనగరం ఫోర్ట్: గ్రామాల అభివృద్ధికి అవసరమైన వ్యవసాయ ప్రణాళికలు తయారు చేయాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విద్యాలయం విస్తరణ సంచాలకుడు డాక్టర్ శివన్నారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక గాజులరేగ వ్యవసాయ పరిశోధన స్థానంలో గ్రామ అనుభవ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో వనరుల వినియోగం, పంట సరళి, భూసారం, తదితర విషయాలపై ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ఓబయ్య, డాక్టర్ ముకుందరావు, డాక్టర్ కె. లక్ష్మణ్, డాక్టర్ ఎంవీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మినీ గోకులాలు ప్రారంభం



రాకోడులో గోకులాలను ప్రారంభిస్తున్న కూటమి నేతలు

విజయనగరం రూరల్: పాడి పరిశ్రమను అభివృద్ధి చేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని కాపునాడు కార్పొరేషన్ చైర్మన్ పాలవలస యశస్విని అన్నారు. మండలంలోని రాకోడు, గుండాలపేట, కోరుకొండ గ్రామాలలో 11 మినీ గోలకులాలను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మినీ గోకులాల ఏర్పాటులో ప్రభుత్వం 90 శాతం ఆర్థికసాయం చేస్తుందని చెప్పారు. పాడి ఉన్న ప్రతి రైతూ ఆ పథకాన్ని ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తిరుపతినాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు బొద్దల నరసింగరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆధునిక పరికరాలతో అంధత్వ నివారణ



మాట్లాడుతున్న రామచంద్రన్ రాఘవన్

నెల్లిమర్ల రూరల్: అంధత్వ నివారణకు అత్యాధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయని బెంగుళూరుకు చెందిన రెమోడియో వ్యాపారవేత్త రామచంద్రన్ రాఘవన్ అన్నారు. శుక్రవారం స్థానిక సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఆటోమేటిక్ రెట్రాక్టోమీటర్ పరికరం ద్వారా 90 సెకన్లలో 24 కంటి పరీక్షలు నిర్వహించగలమన్నారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ విజయ్ బాబు, డీన్ డాక్టర్ పుష్పలత, డాక్టర్ చైతన్య, డీన్ ఐక్యూఏసీ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

మామిడికి మంచు ముప్పు

- మాడిపోతున్న మామిడిపూత
- సుమారు 15 వేల ఎకరాల్లో పంటకు నష్టం
- ఆందోళనలో రైతులు



మాడిన పూతను పరిశీలించి సూచనలు ఇస్తున్న ఉధ్యానవనశాఖ అధికారి జ్యోత్స్న



పూసపాటిరేగలో మంచుకు దెబ్బతిన్న మామిడి

పూసపాటిరేగ: కొద్ది రోజులుగా కురుస్తున్న పొగమంచుతో మామిడి పంటకు నష్టం వాటిల్లుతోంది. కొన్నిచోట్ల పూత రాకపోవడం, మరికొన్ని చోట్ల పూత రాలిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ఉద్యానవన శాఖాధికారులు తగిన సూచనలు, సలహాలు అందించాలని రైతులు కోరుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 15 వేల ఎకరాలలో మామిడి సాగవుతోంది. ఏటా డిసెంబర్, జనవరి నెలల్లో మామిడి పూత వస్తుంది. ఈ పూత వచ్చినప్పుడు వాతావరణం అనుకూలిస్తే మంచి దిగుబడులు వస్తాయి. కాని కొన్ని రోజులుగా అధికంగా కురుస్తున్న మంచు కారణంగా మామిడి దిగుబడికి కోలుకోలేని దెబ్బ తగలనుంది. ప్రస్తుతం పూత దశలో ఉన్న మామిడికి మంచు తీవ్ర నష్టం కలిగిస్తోంది. తోటలను కౌలుకు తీసుకున్న రైతులు తీవ్రంగా నష్టపోనున్నారు. గతేడాది కూడా ఇదే మాదిరిగా మంచు కురవడంతో పంట తీవ్రంగా నష్టపోయింది. ఈ ఏడాది కూడా మంచు అదేవిధంగా కురుస్తుండడంతో దిగుబడి తగ్గిపోయే ప్రమాదముందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పూత మాడిపోతోంది..

పది రోజులుగా కురుస్తున్న మంచుకు పూత మాడిపోయి కనిపించడం లేదు. ఇదేవిధంగా మంచు పడితే పంటలు తీవ్రంగా నష్ట పోతాయి. ప్రకృతి వైపరిత్యాలు రైతులను కుదేలు చేస్తున్నాయి. ఉద్యానవన అధికారులు తక్షణమే స్పందించి రైతులకు న్యాయం చేయాలి.

– కె. వెంకటరావు, ఉద్యానవన రైతు పూసపాటిరేగ

సూచనలు చేస్తున్నాం..



మామిడి తోటకు నష్టం వాటిల్లకుండా రైతులకు సూచనలు, సలహాలు అందిస్తున్నాం. మమిడి సాగు పచ్చిపూత దశలో ఉన్నప్పుడు ఇమిడా 0.5 ఎంఎల్, మిథైల్‌డిమటాన్ 2 ఎంఎల్, సాఫ్ 2 గ్రాముల మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. నల్లపూత దశలో ఉన్నప్పుడు సిప్రోనిల్ 2 ఎంఎల్, ఎంత్రాకాల్ 2 5 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

– జ్యోత్స్న, ఉద్యానవన శాఖాధికారి, భోగాపురం

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరగాలి

- డీఎంహెచ్ఓ జీవనరాణి



కొండవెలగాడ పీహెచ్‌సీని సందర్శిస్తున్న డీఎంహెచ్ఓ జీవనరాణి

నెల్లిమర్ల రూరల్: ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా చర్యలు చేపట్టాలని డీఎంహెచ్ఓ ఎస్. జీవనరాణి సిబ్బందికి సూచించారు. మండలంలోని కొండవెలగాడ, జరజాపుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి, రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం రోగులతో మాట్లాడి అందుతున్న సేవలపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యారోగ్య సిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్యను తగ్గించాలి..

- ఏపీటీఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

విజయనగరం అర్బన్: ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తిలో విద్యార్థుల సంఖ్యను తగ్గించాలని ఏపీటీఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం స్థానిక ఏపీటీఎఫ్ జిల్లా కమిటీ కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు పలు తీర్మానాలు చేశారు. ఉన్నత పాఠశాలలో తగరతికి 54 మంది విద్యార్థులు కాకుండా 1:40 నిష్పత్తిలో విద్యార్థుల సంఖ్య ఉంచాలని అభిప్రాయపడ్డారు. అలాగే ప్రాథమిక పాఠశాలలో 1:20 నిష్పత్తి ఉండాలన్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.బలరాం నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎ.సదాశివరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.ఈశ్వరరావు, నాయకులు ఆర్.కృష్ణ, ఎస్.శ్రీదేవి, ఏవీ శ్రీనివాసరావు, సీహెచ్ పైడితల్లి, సీహెచ్‌వీఎస్ఎన్ మూర్తి, దామోదరనాయుడు, కె.సత్యారావు, ఎస్.శ్రీదేవి, తదతరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు తొలగించాలి

విజయనగరం: నగరంలోని వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఈనెల 16వ తేదీ రాత్రి కల్లా స్వచ్ఛందంగా తొలగించాలని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ కొంతమంది ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారని.. వాటిని ఈనెల 16వ తేదీ వరకు మాత్రమే అనుమతిస్తున్నట్లు పేర్కొన్నారు. 17వ తేదీ ఉదయానికి ఎక్కడైనా ఫ్లెక్సీలు కనబడితే ప్రణాళికా సిబ్బంది వాటిని తొలగించడంతో పాటు బాధ్యుల నుంచి అపరాధ రుసుం విధిస్తారని స్పష్టం చేశారు.

రెవెన్యూ సదస్సుకు 38 మంది హాజరు..

విజయనగరం రూరల్: గత నెలలో విజయనగరంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 38 మంది రైతులు హాజరయ్యారని డీపీఆర్‌ఓ రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ సదస్సులపై సాక్షిలో ఇటీవల ఆరంభ శూరత్వమే అన్న శీర్షికన ప్రచురితమైన కథనానికి డీపీఆర్‌ఓ స్పందిస్తూ, ఆరోజు జరిగిన రెవెన్యూ సదస్సుకు ఉన్నతాధికారులు హాజరయ్యారని పేర్కొన్నారు. సదస్సు ప్రారంభమయ్యాక వేరే పనిమీద బయటకు వెళ్లాల్సి వచ్చిందని, సదస్సులను ఒక క్రమపద్ధతిలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

మార్మోగిన గోవిందనామ స్మరణ



పూసపాటిరేగ: కోనాడ వేణుగోపాల స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న వేదపండితులు

సూర్యుడు ఉత్తరాయణానికి మారేముందు వచ్చే ధనుర్మాస శుద్ధ ఏకాదశినే వైకుంఠ ఏకాదశి అంటారు. ఈ రోజున వైష్ణవాలయాల్లో వైకుంఠ లోగిళ్లు తెరుచుకుంటాయి. భక్తులు ఈ ద్వారం గుండా స్వామివారిని దర్శించుకుంటారు. విష్ణుమూర్తి గరుడ వాహనధారుడై ముక్కోట్ల మంది దేవతలతో భూలోకానికి వచ్చి భక్తులకు దర్శనమిస్తాడు కాబట్టే ఈ రోజును వైకుంఠ ఏకాదశి అంటారు. విజయనగరం, నెల్లిమర్ల నియోజకవర్గ పరిధిలోని వైష్ణవాలయాల్లో వైకుంఠ ఏకాదశిని శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. భక్తులు ఉత్తర ద్వారం గుండా స్వామివారిని దర్శించుకున్నారు. దీంతో ఆలయాల్లో గోవిందనామ స్మరణ మార్మోగింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్/ఫొటోగ్రాఫర్



విజయనగరం టౌన్: టీటీడీ కళ్యాణ మండపం ఆవరణలో ఉన్న ఆలయంలో భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు



విజయనగరం టౌన్: అరుంధతీనగర్‌లో భక్తులకు దర్శనమిస్తున్న వైభవ వేంకటేశ్వర స్వామి



విజయనగరం టౌన్ తోటపాలెంలో స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న ఆలయ అర్చకుడు రంగాచార్యులు



పూసపాటిరేగ: కోనాడ పురవీధులలో గరుడ, నంది వాహనంపై ఊరేగుతున్న వేణుగోపాలస్వామి



డెంకాడ: వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వారా దర్శనంలో పాల్గొన్న భక్తులు



డెంకాడ: వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో భక్తుల సందడి



నెల్లిమర్ల రూరల్: రామతీర్థంలో సీతారాముల పల్లకీ సేవలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి కుటుంబ సభ్యులు



విజయనగరం కళ్యాణ వేంకటేశ్వర ఆలయంలో వైకుంఠ ద్వారం వద్ద ప్రత్యేక అలంకరణలో స్వామివారు



కోనేటిలో ప్రత్యేక పుష్పాలంకరణలో స్వామివారు



విజయనగరం రూరల్: రామనారాయణం ఆలయంలో ప్రత్యేక పూజలు అందుకుంటున్న స్వామివారు



కళ్యాణ వేంకటేశ్వర ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనానికి బారులు తీరిన భక్తులు



ఆలయ ప్రాంతంలో దీపాలను వెలిగిస్తున్న మహిళలు



రింగ్ రోడ్డులో వేకువజామునే బారులు తీరిన భక్తులు

• సంక్రాంతి సంబరాలు..



జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ముందుగానే భోగి, సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలతో అలరించారు. కళాశాల వైస్‌చైర్మన్ పి.శ్రీనివాసరావు, సెక్రటరీ కె.శివరామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి భోగిమంట వెలిగించారు. విద్యార్థులు, అధ్యాపకులు ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ పి.శ్రీనివాసరావు, సెక్రెటరీ కె.శివరామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ టి.హరిబాబు, ఫెమినావింగ్ కో ఆర్డినేటర్ జానకి, డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. – డెంకాడ

• ఆర్థికసాయం..



పూసపాటిరేగ మండలంలోని కొవ్వాడ అగ్రహారం గ్రామానికి చెందిన శిర్రి ప్రసాద్ అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ కోట్ల రామునాయుడు రూ. 25 వేలను శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే కొవ్వాడలో చర్చి అభివృద్ధికి రూ. 40 వేలు, రజక కాలనీలో కుళాయిల నిర్మాణానికి 30 వేల రూపాయల ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో హరిబాబు, అప్పలనర్సయ్య, తదితరులు పాల్గొన్నారు. – పూసపాటిరేగ

• పార్టీ బలోపేతానికి కృషి..



నెల్లిమర్ల నగర పంచాయతీలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు సూచించారు. పార్టీ నగర పంచాయతీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కోరుకొండ వెంకట కృష్ణారావు విజయనగరంలో మజ్జి శ్రీనివాసరావును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. – నెల్లిమర్ల

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- 108 ఏఈఎంఎస్ జోనల్ మేనేజర్ నజీర్ హుస్సేన్

విజయనగరం ఫోర్ట్: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని 108 ఏఈఎంఎస్ జోనల్ మేనేజర్ నజీర్ హుస్సేన్ తెలిపారు. శుక్రవారం స్థానిక 108 సంస్థ కార్యాలయంలో డిస్ట్రిక్ వెల్ఫేర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు పలు సమస్యలను జోనల్ మేనేజర్ దృష్టికి తీసుకువచ్చారు. ఐఎఫ్‌టీల సంఖ్య తగ్గించాలని, పరస్పర అంగీకార బదిలీలు చేయాలని, ఇంక్రిమెంట్ ఇచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నజీర్ హుస్సేన్ తెలిపారు. సమావేశంలో డీబ్ల్యూసీ సభ్యులు బోని వెంకటరమణ, పెనుమత్స సుబ్బరాజు, నౌపడ పుష్పపతి, బంకపల్లి త్రినాథ్, కె.చక్రధర్, 108 ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు వేమలి అప్పలనాయుడు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్స్ అవనాపు సాయి షణ్ముక్, బంటుపల్లి ఉపేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

15న గో పూజోత్సవం



గోపూజోత్సవం పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్యామ్ సుందర్, తదితరులు

విజయనగరం టౌన్: టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఈ నెల 15న గోపూజోత్సవం నిర్వహించనున్నట్లు టీటీడీ ప్రోగ్రామింగ్ కోఆర్డినేటర్ జె.శ్యామ్‌సుందర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కళ్యాణ మండపం ఆవరణలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోవులను పూజిస్తే సకల శుభాలు కలుగుతాయన్నారు. విజయనగరంలో టీటీడీ కళ్యాణ మండపం ఆవరణలోను.. పార్వతీపురం మన్యం జిల్లాలో గరుగుబిల్లి మండలం సీతారామపురం శ్రీరామలయంలో పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టీటీడీ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలి..



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జీవనరాణి

- డీఎంహెచ్ఓ జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: సర్వే ద్వారా కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలని డీఎంహెచ్ఓ జీవనరాణి తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమంపై పీహెచ్‌సీ వైద్యులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. వ్యాధిగ్రస్తులను త్వరగా గుర్తించి చికిత్స అందించగలిగితే అంగవైకల్యం బారిన పడకుండా కాపాడవచ్చన్నారు. సమావేశంలో డీఎల్ఓ కె. రాణి, ఎన్‌సీడీపీఓ సుబ్రహ్మణ్యం, డీఎంఓ మణి, డాక్టర్ అర్చన, తదితరులు పాల్గొన్నారు.

12న రంగవల్లుల పోటీలు

విజయనగరం టౌన్: సనాతన సంస్కృతీ, సంప్రదాయాలను భావితరాలకు అందజేయడమే లక్ష్యంగా వాజీ చానల్ 29 ఏళ్లగా రంగోలి పోటీలను నిర్వహిస్తోందని చానల్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 12న ఉదయం 11 గంటలకు ఆనంద గజపతి ఆడిటోరియంలో రంగోలీ పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. డిసెంబర్ 31న నిర్వహించిన హౌసీ విజేతలకు కూడా అదే రోజున బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

చదువుతో పాటు ఆటలకు సమయం

- ఎంఈఓ పీవీబీఆర్‌సీహెచ్ రాజు



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ పీవీబీఆర్‌సీహెచ్ రాజు

విజయనగరం అర్బన్: పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు సమయాన్ని కేటాయించాలని ఎంఈఓ పీవీబీఆర్‌సీహెచ్ రాజు అన్నారు. సంక్రాంతి సంబరాల సందర్భంగా స్థానిక ధర్మపురి ఎల్‌డీజీ జూనియర్ కళాశాల, ఎస్ఎల్‌జీ డిగ్రీ కళాశాలలో డాక్టర్ పాలూరి శేషగిరిరావు స్మారక పాఠశాల స్థాయి క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల మానసిక, శారీరక అభివృద్ధికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వై.శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు గోపాల్, చంటి, ధర్మారావు, తొడుబాబు, వాణిశ్రీ, శ్రీగౌరి, వరలక్ష్మి, శ్రీను, సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.